50607890l

మనసు నిల్పినవాడెపో మానవుండు
బుద్ధినెఱిగిన మనుజుండె బుధవరుండు
చెప్పు చేతలు ఒకటైన శ్రేష్ఠుడగును
ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు.

మనసు కారణంబు మరియెందునున్నను
ఇల్లు అడవి ముక్తినీయ లేవు
మనసు లేనివాడు మందిరమున నున్న
కాననమున నున్న కార్యమేమి?

విద్యార్థులారా!

మానవ జీవితము అనేకస్థాయిలలో మార్పులు చెంది కూర్పులు కలిగి అభివృద్ధి గావించుకుంటుంది. బాల్యము కౌమారము, యౌవనము, వార్ధక్యము అను దశలయందు అభివృద్ధిగాంచి ఆయా దశలకు సంబంధించిన కోరికలను అభివృద్ధిగావించుకొని మానవుడు జీవితమును జగత్తులో నిలుపుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఐతే మానవుడు ఆయా స్థాయి యందున్న స్థితులను గుర్తించుకొనలేక లోకమే మార్పు చెందుచున్నదని భ్రమిస్తున్నాడు. దీనికి మూలకారణము మనస్సే. మానవుడు ఎన్నియో ఘనకార్యములు సాధించాడు. ఎన్నియో విజయములను అందుకుంటున్నాడు. దుర్లభమైన మానవజన్మనెత్తి కూడను మనసును మాత్రం అరికట్టలేకపోతున్నాడు. మనసు యొక్క విజయాన్ని సాధించలేకపోతున్నాడు. మనస్సు క్షణక్షణమునకు ఒక పదార్థము నుండి మరొక పదార్థమునకు ఒక విషయము నుండి మరొక విషయమునకు ప్రయాణం సలుపుతూ వుంటుండాది. సరోవరములో పెదపెద రాళ్లు వేస్తూ వుండినప్పుడు ఈ సరోవరము ప్రశాంతి యేరీతిగా అభివృద్ధిగావించుకోగలదు. ఒకదాని తరువాత ఒకటి రాళ్లు సరోవరములో వేస్తున్నప్పుడు అంతులేని తరంగములగుటచేతను అశాంతియైన అలల చేతను అల్లకల్లోలమును అనుభవిస్తూవుంటుంది. అదే విధముగనే మనిషి యొక్క మానససరోవరమునందు ఒక కోరిక తరువాత మరొకటి ఒక కోరిక తరువాత మరొకటి కోరికలనే రాళ్లు విసురుతూ వుంటే ప్రశాంతి ఏరీతిగా కలుగుతుంది? ఈ సరోవరము స్థిరముగా అచంచలముగా ఏరీతిగా నిలువగలుగుతుంది? ఇది అసాధ్యము. మానవుడు ఆయా వయసుకు తగినట్లుగా మితమైన కోరికలను వుంచుకొని తద్వారా మనస్సుయొక్క

ప్రశాంతికి తగిన అవకాశము నందించాలి.

మనసు ఒక ఈగవంటిది. ఇది నిత్యానిత్య విషయ పరిశీలనా శక్తి లేక అనేక విధములుగా యిచ్ఛానుసారము సంచరిస్తూ వుంటుంది. ఒక క్షణము లోపల పవిత్రమైన ప్రసాదముపైన వాలుతుంది. రెండవక్షణములోనే ఒక పెంటబండపై వాలుతుంటుంది. ఈ విధముగా మానవుడు ఒక నిముషములో మంచి తలంపులను అభివృద్ధి పరచుకుంటాడు. మరొకక్షణములోపల దీనికి విరుద్ధమైన దుర్భావములచేత దుశ్చింతల చేత మనసును అల్లకల్లోలము గావించుకుంటారు. మనసుకు ఒక హద్దుపద్దులేదు. పవిత్రమా అపవిత్రమా అనే విచారణాశక్తి కూడను లేదు. నిత్యానిత్య విషయ పరిశీలనా శక్తి బుద్ధి మానవునియందుండినప్పటికిని యీ బుద్ధిని సద్వినియోగ పరచుకునే సదవకాశాన్ని తాను పొందలేకపోతున్నాడు. మనస్సు మదగజము వంటిది. మావటి అనేక విధములుగా దీనిని శుభ్రపరచి జలముతో కడిగి గట్టునకు తెచ్చినప్పుడు తొండముతో మట్టిని తలపైన వేసుకుంటుంది. ఇది సహజము. అదేవిధంగా మానవుని యొక్క స్థితి కూడను. సాధనలయందు పవిత్రమైన కర్మలచేతను, దివ్యమైన భావముల చేతను అప్పుడప్పుడు శుభ్రము గావించుకున్నప్పటికి ప్రాపంచిక సంబంధమైన విషయవాసనలనే తన శిరస్సుపైన చల్లుకొని అనేక విధములైన అశాంతికి గురౌతున్నాడు. మనస్సు ఒక పెద్ద ప్రవాహము వంటిది. ప్రవాహమును ఒక చెరువునందు చేర్చవలెనన్న దానికి పూర్వము ఆ చెరువునకు వుండిన రంధ్రములను మూసివెయ్యాలి. అట్లు కాకుండా యీ నదీ జలమును చెరువులో నింపుటకు ప్రయత్నించినప్పుడు ఆ చెరువుకు వుండిన గండ్లచేత యీ జలమంతా బయట పడిపోతుంటుంది. ఈ జలమును నింపి ప్రయోజనము వుండదు. మానవుని మనస్సే ఒక పెద్ద సరోవరము. ఆత్మశక్తి అనేది గొప్ప ప్రవాహము. ఇది బుద్ధి అనే కాలువ ద్వారా మనస్సరోవరము లోపల ప్రవేశిస్తుంది. చెరువునకు యింద్రియములనే గండ్లు పడ్డాయి. ఇంద్రియములను నిగ్రహించినప్పుడే ఆత్మశక్తి అనే జలము యీ మానస సరోవరములో నిలచ కలుగుతుంది. మనస్సు యింద్రియములకు అధిపతి. కాని యింద్రియములకు లోబడిపోతున్నది. రాజు సేవకులకు లోబడినట్లుగా మనస్సు యింద్రియములకు లోబడిపోతున్నది. సేవకులకు లోబడిన మహారాజు ఏ విధమైన స్వాతంత్ర్యాన్ని పొందగలడు? ఏ విధమైన గౌరవ మర్యాదలు అందించగలడు? అదే విధముగ యజమానుడైన మనస్సు తనదాసులైన యింద్రియములకు లొంగినప్పుడు మనిషి దాసుడుగా మారిపోతున్నాడు. కనుక మనిషి అనేవాడు నిరంతరము యజమానుడుగానే వుంటుండాలి కాని సర్వెంటు కాకూడదు. కారణమేమనగా మనస్సు నిరంతరము యింద్రియముల యొక్క ఆకర్షము పైనను యింద్రియముల యొక్క చైతన్యము చేతను యింద్రియముల యొక్క మార్గము చేతను తనశక్తిని కోల్పోతున్నది. జిహ్వ చేత

506078903

అనేక విధములుగా అధికంగా మాట్లాడటం చేతను, అనేక విధములైన దృశ్యములను దర్శించటం చేతను, చింతించటంచేతను మనశ్శక్తి క్షీణించి పోతుండాది. దేహశక్తి ఏవిధముగా ఆహారము లేక క్షీణిస్తుందో మనస్సు యొక్క శక్తి యింద్రియముల చేత క్షీణిస్తుండాది. కనుక మానవుడు యీ చింతలను అదుపులో వుంచాలి. సంకల్ప వికల్పములు కూడను అదుపులో వుంచాలి. అప్పుడే మానవుని మనశ్శక్తి చాలా తీవ్రమైన రీతిగను, పవిత్రమైన రీతిగను అభివృద్ధిగావించుతుంది. మానసిక శక్తి యీనాడు మనిషికి అత్యవసరము. మనసు నుంచే మనిషి అయ్యాడు. మానసిక శక్తి క్షీణించినప్పుడు మనిషి యొక్క పవిత్రత కూడను క్షీణించి పోతుంది. దురాశల చేత యింద్రియములకు వుత్సాహ ప్రోత్సాహములనందించటంచేత మానవత్వము అనేకవిధమైన దుఃఖములకు అశాంతికి గురైపోతుండాది.

దుఃఖమునకు కారణమేమని విచారించినప్పుడు దీనికి అజ్ఞానమే కారణము. అజ్ఞానమునకు కారణమేమిటి? అహంకారమే కారణము. అహంకారమునకు కారణమేమిటి? రాగమే కారణము. రాగమునకు కారణమేమిటి? దేహమే! ఏతావాత దుఃఖము దేహము వలననే ప్రాప్తిస్తుండాది. ఈ దేహమునందుండిన యింద్రియములను నిగ్రహించుకున్నప్పుడు మానవునికి లౌకికమైన మార్గమునందుగాని ఆధ్యాత్మిక మార్గమునందుగాని దుఃఖమనేది ఏనాడు కూడను వుండదు. మానవునకు దుఃఖము సహజము కాదు. ఇది కారణ రూపమునకు చెందినదే గాని మనిషికి సహజమైనది కాదు. దుఃఖమే సహజమైనదిగా యుండిన దీనిని ఎవ్వరు ఏమాత్రము విచారణ చేయలేరు. ఒక్క చిన్న ఉదాహరణము. బెల్లమునకు తీపి సహజము. దాని సహజమైన తీపిని నిర్మూలము గావించాలని ఎన్ని విధములుగా ప్రయత్నించినప్పటికి యీ తీపి పోవుటకు వీలుకాదు. మానవునికి దుఃఖమనేది సహజమైన యీ దుఃఖ నివారణకు మార్గము లేక వుండి వుండేవి కాదు. ఎన్ని సాధనలు చేసినా దుఃఖము నివారణ కాదు. ఇది అసహజమైనది. కనుకనే దీనికి నివారణ మార్గములనేకములుంటున్నాయి. దైవచింతన చేతను, ఆధ్యాత్మిక మార్గము చేతనే దుఃఖము నివారణమౌతుంది. ఒక సోమరిపోతైన గుఱ్ఱానికి పుష్టికరమైన పదార్థములు ఎన్ని అందించినప్పటికి అది మరింత సోమరిగానే మారుతుంది. ఇంద్రియములు ఒక సోమరిపోతు వంటిది. వీటికి అడిగిన పుష్టికరమైన ఆహారములన్ని కూడను ఇష్టములంతా కూడను చేకూరుస్తూ వచ్చినప్పుడు యీ యింద్రియములు మరింత బలపడిపోతాయి. ఇవి బలపడి కడపటికి మానవత్వాన్ని నిర్మూలము గావిస్తాయి. సత్యమార్గమునందు మానము మనస్సును ప్రవేశపెట్టినప్పుడు తద్వారా నిత్యమై భవిష్యత్తు నందు ఆనందాన్ని అనుభవించవచ్చు.

ఒక చిన్న ఉదాహరణము. ఇంద్రియముల ద్వారా యే విధమైన మార్గాన్ని మనం అనుసరించాలి అనే విషయాన్ని గుర్తించాలి. మానవుని మూడు విధములైన

దుఃఖములు వెంటాడుతున్నాయి. మొదటిది ఆధ్యాత్మిక దుఃఖము, రెండవది అధిభౌతిక దుఃఖము, మూడవది ఆదిదైవిక దుఃఖము. ఆధ్యాత్మిక దుఃఖమనగా శరీరమునకు మనస్సునకు చెందిన రోగముల యొక్క బాధలే. శరీరమునకు అనేక రకములైన రోగములు సంప్రాప్తమవుతున్నాయి. ఈ రోగముల చేతనే మానవుడు అనేక విధములైన దుఃఖములకు గురౌతున్నాడు. ఒకవేళ శరీరము సుక్షేమంగా వుండినప్పటికిని మానసిక సంబంధమైన రోగములు కూడను ఇంద్రియముల ద్వారా అనేకములు చేరుతుంటున్నాయి. ఇంద్రియముల ద్వారా ప్రవేశించె రోగములు మనసుకు మరింత బాధనందిస్తున్నాయి. కనుక ఆధ్యాత్మిక దుఃఖమనగా, శారీరక మానసిక అనారోగ్యసంబంధములే. ఇంక ఆదిభౌతిక దుఃఖమనగా పాముల చేతగాని, పశువుల చేతగాని, మృగముల చేతగాని యింకే విధమైన క్రిముల చేతగాని జీవితమునకు కొన్ని ఆపదలు సంభవిస్తుంటాయి. ఆదిభౌతికమనగా ప్రాపంచిక సంబంధమైన భూతముల చేత కలిగే దుఃఖములు. ఆదిదైవిక దుఃఖమనగా అతివృష్టి అనావృష్టి, భూకంపము, నదులంతా పొంగటము, అగ్నిప్రమాదములు యిలాంటి కొన్ని దైవికమైన అనగా ఎదురు చూడని దుఃఖములు మనవెంటాడుతుంటాయి. మనము ఏమాత్రము ఎదురు చూడని సమయములోపల ఒక్కతూరి పిడుగులు బాధలు కలిగింప చేస్తుంది. ఇది ఆదిదైవికము. ఇలాంటి దుఃఖములకు పరిహారము మన యింద్రియములే గావిస్తుంటున్నాయి.

ఈ అన్నింటికిని ప్రధానమైనది జిహ్వ. మనము అధిక భాషణ లేకుండా, మితభాషతో, సత్యభాషణమును అలవరచుకున్నప్పుడు తద్వారా మానసిక శక్తి మరింత అభివృద్ధి గాంచుతుంది. మితభాష, హితభాష అత్యవసరము. సత్యము చేత ఎంతటి మహత్తరమైన కార్యమునైనను సులభంగా సునాయాసముగా సాధించవచ్చు. సర్వధర్మములకును సత్యమే పునాది: 'సత్యాన్నాస్తి పురో ధర్మః' ఈ సత్యం కూడను అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రీతి హితంచయత్'. ప్రీతిగను, హితముగను ఉద్వేగము లేకుండాను వుంటుండాలి. సత్యము చేత ప్రాణమును కాపాడుకోవచ్చును. తెచ్చుకోవచ్చుకూడను. అశ్వపతి మహారాజుకు సావిత్రి ఏకైక కుమార్తె. ఆమెను సత్యవంతునకిచ్చి వివాహము చేయాలని మాటయిచ్చియున్నాడు. ఈలోపల నారదుడు ప్రవేశించాడు. 'అశ్వపతీ! నీవు చాలా పొరపడుతున్నావు. నీ ఏకైక పుత్రి అనంతకాలము సుమంగళిగా వుంటుండి నీకు సరియైన ఆనందాన్ని అందించాలని ఆశిస్తున్నావు. కాని సత్యవంతుడు ఒక సంవత్సరము మాత్రమే జీవనప్రమాణము వుంది. తదుపరి నీకు మొత్తం మహాకష్టములకు గురి కావలసి వస్తుంది' అని చెప్పాడు. తనపని తాను చేసి వెళ్ళిపోయాడు. తండ్రి చాలా విచారములో మునిగాడు. బిడ్డదగ్గరకి వచ్చి నారదుడు చెప్పిన విషయములంతా వివరించి చెప్పాడు. సావిత్రి చెప్పింది. నాన్న! మాట ఒకేటి. సత్యమే భగవత్స్వరూపము. మనము సత్యాన్ని వదలినప్పుడు భగవంతుని కించపరచినవారమౌతాము. భగవంతుని వదలిన తరువాత

506078905

మనము దేనిని సాధించగలము.? సత్యాన్ని మనము అనుసరిస్తే, సత్యాన్ని ఆరాధిస్తే, సత్యాన్ని మనము విశ్వసిస్తే ఆ సత్యమే సర్వమంగళములను అందిస్తుంది. కనుక నేను ఏమాత్రము కూడను మాటను వెనుకకు తీసుకోకూడదు. సత్యవంతునికిచ్చిన మాటను మనము సత్యంగా పరిపాలన చెయ్యాలి. నా అదృష్టము ఎట్లాగుంటున్నదియో చూచుకొనవచ్చును. నేను సత్యాన్ని అనుసరిస్తున్నాను. ఆరాధిస్తున్నాను. నేను సత్యవంతునే వివాహమాడతాను. ఆ సత్యమే సత్యవంతుని బ్రతికిస్తుంది. కనుక మాటను వెనుకకు తీసుకోకూడదు. అని గట్టిగా చెప్పింది. నారదుడు చెప్పినట్లుగా ఒక సంవత్సరము తరువాత సత్యవంతుడు మరణించటము సత్యమునే ఆరాధనగా చేసి, తాను ప్రతిజ్ఞగా చేసి దీక్షగా బూని తిరిగి ప్రాణము వాపస్ తెచ్చుకోటం జరిగింది. కనుక మాటను మనము అతిజాగ్రతగా వుపయోగించుకోవాలి. తద్వారా మానసిక శక్తి, హృదయ పరివర్తన, పరిశుద్ధత మనకు ఎంతైనా కలుగుతుంది. ఎన్ని కష్టములు సంభవించినప్పటికిని ఎన్ని విధములైన బాధలు కలిగినప్పటికిని, ఎన్ని విధములైన నిందలు, నిష్ఠూరములు కలిగినప్పటికిని మన మాటలు మనం యేమాత్రము జారవిడువరాదు. దాన్ని తిరిగి వెనుకకు తీసుకోకూడదు. మన సత్యాన్ని మనం పాటించాలి. మన సత్యాన్ని మనం అనుసరించాలి. ఈ సత్యారాధననే వుల్లంఘించినప్పుడు దైవస్వరూపమైన సత్యాన్నే మనం వుల్లంఘించినట్టవుతుంది. భగవంతుని వుల్లంఘించిన వాడు ప్రకృతిలో యింక దేనిని సాధించగలడు. భగవంతుని తోనే సర్వవిజయములు కూడను.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయోభూతి ర్ధ్రువానీతిర్మతిర్మమ.

భగవంతుని హృదయములో పెట్టుకున్నప్పుడే, బలమైన విశ్వాసములో వుండినప్పుడే ఈ విజయాన్ని మనం సాధించగలము. కానీ యీనాడు లోక సంబంధమైన విషయ వాసనలే మనకు ప్రాణ సమానముగా వుంచుకున్నాము. మనసుకు రెండు విధములైన సంకల్పములుంటున్నాయి. శుద్ధ సంకల్పము, మలిన సంకల్పము అని. మలిన సంకల్పమనగా అనిత్యము, అశాశ్వతమైన ప్రాకృత సంబంధమైన విషయములందు మన సంకల్పములను అభివృద్ధి పరచుకోటం. నిత్యసత్యమైన, దివ్యత్వమైన దైవము యొక్క గుణములను అభివృద్ధి గావించుకోటం శుద్ధ సంకల్పము. శుద్ధ సంకల్పములచేతనే విశుద్ధమైన జ్ఞానము కూడను మనకు లభ్యమవుతుంది. ఈ జ్ఞానబోధ అనేది కేవలము గురువులద్వారా లభించేది కాదు. లేక గ్రంథపఠనము చేత లభ్యమయ్యేది కాదు. మన సాధనల చేతనే దీని యొక్క జ్ఞానమును మనము అభివృద్ధి గావించుకోవచ్చు. దృఢమైన విశ్వాసము చేత మనం ఆరాధన చేస్తుంటే సాధించలేనిది లోకములో ఒకటి కూడా లేదు.

ఒక గురువు దగ్గరకి ఒక శిష్యుడు వెళ్లాడు. స్వామి! నాకేదైనా జ్ఞాన

పదేశం చెయ్యండి అన్నాడు. ఆ గురువుగారు గది బయట కూర్చొని వున్నారు. నాయనా! ఇంక సాయంకాల సమయము కాబోతుండాది. లోపల గుహలోకి వెళ్లి నీకు వుపదేశం చేస్తాను. ఐతే మనం పోక పూర్వమే అక్కడొక జ్యోతి వుంటాది. దాన్ని ముట్టించుకొని రాపొమ్మన్నాడు. అక్కడికి పోయాడు. ఒక నిప్పుపెట్టె తీసుకువెళ్లాడు. ఎన్ని విధాలుగానో గీసి దాన్ని అంటించటానికి ప్రయత్నించాడు. పుల్లలంతా అయిపోయినాయిగాని అది అంటుకోలేదు. స్వామి! గురూజీ! ఈ దీపం వెలగటంలేదన్నాడు. దేనికోసం వెలగటంలేదు ఆ దీపం ఇటు తీసుకొనిరా అన్నాడు. అందులో వుండినది తైలమా జలమా? యోచించమన్నాడు. చూచాడు. వేళ్లు పెట్టి. అది జలముగా కనుపించింది. స్వామి! అది జలంగా వుంటుండాది. అన్నాడు. ఆ జలమునే వత్తి పీల్చుకుంటున్నాది. మొట్టమొదట ఆ జలమునంతా పారపొయ్యి. వత్తిలో వుండిన జలమునంతా పిండివెయ్యి. తరువాత దానికి ఆయిలు వెయ్యి. ఈ వత్తిని తిరిగి ఆయిల్‌లో ముంచు. అప్పుడు వెలిగించు. జ్యోతి చక్కగా వెలుగుతుంది' అన్నాడు. గురువాజ్ఞ ప్రకారం చేశాడు. దివ్యజ్యోతిగా వెలుగుతూ వచ్చింది. సరే! గురువు మౌనాన్ని వహించాడు. చూచాడు శిష్యుడు. స్వామి! ఉపదేశం చేస్తానన్నారు. జ్ఞానోపదేశం ఎప్పుడు చేస్తారన్నాడు. ఇంతసేపు చేసిన జ్ఞానోపదేశం నీవు వినలేదా? అన్నాడు గురువు. శిష్యుడు నాకేమీ అర్థం కావటం లేదన్నాడు. నీ హృదయమనే ప్రమిదలోపల ప్రాపంచిక విషయవాసనలనే జలమును నింపుకొని, మనస్సనే వత్తినంతా విషయవాసనలతోనే చేర్చుకొని వుండినప్పుడు ఏ రీతిగా జ్ఞానమనే అగ్ని అంటుకుంటుంది?. మొట్టమొదట నీవు హృదయములో నింపుకున్న భౌతిక విషయ వాసనలనే నీరు పారబొయ్యి. మనస్సనే వత్తినుంచి కూడను దానియొక్క భావములంతా దూరం చేసుకో. భగవత్ప్రేమ అనే తైలము అందులో నింపుకో. అప్పుడు నా ఉపదేశమనే జ్యోతిని నేను వెలిగిస్తాను. అదే జ్ఞాన జ్యోతి. అంతేగాని లోపల ప్రేమ లేకుండా లౌకికమైన విషయ వాసనలతో హృదయాన్నంతా నింపుకుంటే జ్ఞాన జ్యోతి ఏరీతిగా వెలుగుతుంది? ఈ నాటి మానవులంతా అనేక గ్రంధాలు పఠిస్తున్నారు. అనేక ఉపదేశాలంతా పొందుతున్నారు. అనేక సాధనలు చేస్తున్నారు. కాని హృదయములో వున్న మాలిన్యము మాత్రం పరిశుద్ధము చేయటము లేదు. దానికి విరుద్ధమైనటువంటి, తైలమునకు విరుద్ధమైనటువంటి జలమును నింపుకున్నట్లుగా ప్రాకృతమైన విషయములతో తాము నిండి వుంటున్నారు.

మానవత్వమనేదాన్ని ఎన్ని క్షణములు మనము పవిత్రంగా వుపయోగపెడుతున్నాము? పిల్లలూ! మీకందరికి చక్కగా తెలుసు. ఒక నిముషమునకు 60 సెకండ్లు. 60 నిముషములైతే ఒక గంట. 24 గంటలైతే ఒక దినము. 30 దినములైతే ఒక నెల. 12 నెలలైతే ఒక్క సంవత్సరము. ఒక్క సంవత్సరమునకు ఎన్ని సెకండ్లవుతున్నాయి? ఇవన్నీ ఇంటూ చేసేటప్పటికి ఎంతవుతున్నది? మూడు కోట్ల పదకొండు లక్షల నాలుగువేల సెకండ్లవుతుంది. మూడుకోట్ల పదకొండు లక్షల నాలుగువేల సెకండ్లు అనుభవిస్తున్నాము. మన వయస్సు ఎంత వుంటుండాదో దాన్ని అన్నింటికి ఎన్ని సెకండ్లవుతుందో యోచన చేసుకోండి.

మూడు కోట్ల పదకొండు లక్షల నాలుగు వేల సెకండ్లు మనం ఒక సంవత్సరానికి అనుభవిస్తుంటే దాంట్లో నాలుగు సెకండ్లైనా పవిత్రంగా అనుభవిస్తున్నామా? ఇంక మనకు అధికమైన ఆనందము ప్రాప్తించాలంటే ఎక్కడనుంచి? మూడుకోట్లలో, పదకొండు లక్షలలో, నాలుగు వేలలో నాలుగు సెకండ్లు కూడను మనం పవిత్రమైన రీతిగా మనసునుంచుకోటంలేదు. ఇంక నాకు కావాలి కావాలి ఏమిటి కావాలి? ఈ అశాంతికి యింకా అశాంతి కావల్నా? ప్రాకృతమైన జీవితంలో మనకు చిక్కేదంతా అశాంతే తప్ప ప్రశాంతి లేదు. కానీ యీనాడు అనుభవించే పెద్దలందరు అదే గొప్పశాంతిగా భోధిస్తున్నారు.

ఒక వ్యక్తి దేవాలయములోకి పోయి గణపతికి ప్రదక్షిణ చేస్తూ వున్నాడట. ఈలోపల వర్షము వచ్చింది. వాడక్కడే నిలిచాడు. అది చిన్న టెంపుల్ గణపతిది. ఆయనకు తగినంత స్థానము వుండుండాది. సరే! యింతసేపు అక్కడ వుంటుంటాడు. ఏదో గణపతిని తొండము ముట్టాడు. అది ముట్టాడు యిది ముట్టాడు. అంతా ముట్టాడు. బొడ్డు దగ్గరకి వచ్చాడు. వేలు పెట్టాడు. పెట్టగానే అక్కడ తేలు వుండింది కుట్టింది. సరే ఏంచేస్తాడింక. చెప్పుకోలేడు. వర్షం ఆగిపోయింది. బయటకు వచ్చాడు. తాను అనుభవించింది అందరూ అనుభవించాలని వాడికొక దురాశ. అబ్బ ఆ విఘ్నేశ్వరుని బొడ్డులో వేలు పెట్టితే నాకు మహాశాంతి లభించింది అని ఆనందంగా అందరికి చెబుతూ వచ్చాడు. ఇతని మాటలంతా వినేసి ప్రతి ఒక్కరు దాంట్లో వేలు పెట్టారు. అందరికి ఒకే బాధ సంభవించింది. ఎవ్వరూ బయటు చెప్పుకోలేదు. ఈ నాటి పెద్దల స్వభావాలంతా యిట్లా వున్నాయి. తాను సంసారంలో పడి దాని బాధంతా అనుభవిస్తూ అయ్యో సంసారం సంతోషమునకు గుర్తైనటువంటిది. సంతోషమునకు మూలకారణమైనటువంటిది. నీవు కూడా అందులో పడు. నీవు కూడా వేలుపెట్టి దాంతో కుట్టించుకో. వాళ్ళు పడే బాధలు బయట చెప్పుకోటంలేదు. లోకసంబంధమైన విషయవాసనల లోపల ఘోరకమైన బాధలంతా వుంటున్నాయి. బయట చెప్పుకోలేరు. లోపల భరించుకోలేరు.

ఈ ప్రాకృతమైన విషయవాసనలతో అనుభవించే సుఖశాంతులు మనకే మాత్రము కూడను లేవు. ఇటే మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి. సుఖమైనా దుఃఖమైనా అనుభవించాలి. రెండింటిని సమభావముతో తీసుకోవాలి. ఈ రెండు కూడను భగవత్ప్రసాదంగానే అనుభవించాలి. అంతేగాని అది గొప్ప యిది చిన్న అని యీ మాత్రము కంపేర్ చేసుకుంటూ పోకూడదు. మానవత్వము లోపల సాధ్యమైనంత వరకు యీ యింద్రియాలను అదుపులో పెట్టుకోటానికి తగిన కృషి చేయటము చాలా ప్రధానము. దుఃఖమునకు, ఆనందమునకు మనసే మూలకారణమనే సత్యాన్ని గుర్తించాలి. మనసు మంచిదైనప్పుడు యింటిలో వుండినా మనకేమి బాధ లేదు. అడవికి పోయినా ఏ బాధలు వుండవు. మనసు మాలిన్యముతో నింపుకొని అడవికి పోయి కూర్చుంటే అక్కడ శాంతి లభిస్తుందా? మనసు కారణంబు మరియెందు వున్నను యింటనున్న మరి అడవినున్న! యిల్లు అడవి మనకు శాంతి సందించ

506078908

చటం లేదు. మనసే మనకు శాంతి నందిస్తున్నది. మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః. ఈ మనస్సును ప్రేమ మయమైన మనస్సుగా మార్చుకోవాలి. దానికంటె మించినది మరొకటి లేదు.

విద్యార్థులారా! నిత్యము రాత్రి పగలు మారిపోతున్నాయి. సాయం సంధ్య రెండు కూడను మారిపోతున్నాయి. వసంతాది ఋతువులు కూడను మారిపోతున్నాయి. అన్నీ మారుతూ వుండినప్పటికిని మానవుని ఆశలు మాత్రము దినదినానికి పెరుగుతూనే వుంటున్నాయి. వయసు పెరుగు కొలది భ్రాంతులు మరింత అధికమై పోతున్నాయి. ఇది కేవలము ఒక దురదృష్టము. మనస్సు యొక్క చంచలత్వమును అదుపులో పెట్టుకొని ప్రశాంతమైన జీవితమును గడపటానికి తగిన కృషి చేయుటం లేదు. మన వయసు పెరుగు కొలది ఆయుః ప్రమాణము తరుగుతుండాదిగాని ఆశలు మాత్రం పెరుగుతున్నాయి. ఆయుః ప్రమాణము తరగక పూర్వమే ఆశలను అదుపులో నుంచుకోటం అత్యవసరం. ఎప్పుడో ఏమో కనుకనే మొట్టమొదట మనసు అదుపులో నుంచుకున్న ఆనందమును అధికం చేసుకోవచ్చును.

విద్యార్థులు కూడను మాటలను చూపులను శ్రవణమును, తలంపులను సాధ్యమైనంత వరకు అరికట్టుకోటం అత్యవసరము. విద్యార్థులు మనస్సు యొక్క శక్తిని చాలా కృంగజేసుకుంటున్నారు. మానసిక శక్తి తగ్గిపోవటం చేతనే జ్ఞాపక శక్తి యివన్నీ కూడను చాలా వరకు తగ్గిపోతున్నాయి. ముఖ్యముగా మూడు యింద్రియములను అదుపులో వుంచుకోవాలి. దృష్టిని, వాక్కును, తలంపులను. ఈ మూడింటిని అదుపులో వుంచుకుంటే మిగతావన్నీ అందులో లీనమై పోతాయి. పిల్లలలో జ్ఞాపకశక్తి దిన దినమునకు తరిగిపోటానికి మూలకారణము అధిక భాషణే. మాటలు ఎంత తగ్గించుకుంటే అంత దివ్యమైన మానసిక శక్తి అభివృద్ధి గాంచుతుంది. మానసిక శక్తిని అభివృద్ధిగావించుకుంటే దేనికైనా సాధించవచ్చు. దేనినైనా పొందవచ్చు. ఈనాటి మానవునకు మానసిక శక్తి పూర్తిగా క్షీణించి పోతుండాది. చాలా దుర్బలుడై పోతున్నాడు. శరీరం చూస్తే బలంగా వుండవచ్చు ఇది కేవలం జడము. ఈ జడమునకే మాత్రము చైతన్యము లేదు. ఈ చైతన్యమంతా ఆత్మ నుంచే దీనికి సంభవిస్తున్నది. సాన్నిధ్యం చేతనే యీ శరీరం కూడను కదులుతూ వుంటుది. ఎన్ని లక్షలు పెట్టి మనం కార్లు కొంటాం. పెట్రోలు శక్తి లేక కారు ఏమాత్రము కదులదు. అదే విధముగనే యీ శరీరమునకు ఆత్మ సన్నిహితమే లేకపోతే శరీరమేమాత్రము పని చెయ్యలేదు. శరీరము జడము. ఇందులో వుండే సర్వయింద్రియములు ఆత్మశక్తి చేతనే కదలుతూ వుంటాయి.

ఆత్మను శరణాగతుడైనాడంటే సర్వశక్తులు మనకు చేరిపోతాయి. ఎందుకంటె అన్ని యింద్రియములు దైవాధీనములో వుంటున్నాయి. దైవాన్ని అధీనము చేసుకుంటే యీ యింద్రియములకు మనము ఎందుకు యోచించాలి. అదే త్యాగరాజు కూడా చెప్పాడు. 'రామా! నీ అనుగ్రహ బలము ఒక్కటుంటే చాలు నవగ్రహములు నా హస్తగతమై పోతాయి' అన్నాడు

506078909

ఈ నవగ్రహములంతాని స్వాధీనములో వుండేవి. నీవే నా స్వాధీనమైతే అవి నా సర్వెంట్లు అయిపోతాయి కనుక భగవంతుని మనము అదుపులో వుంచుకొని, ఆజ్ఞలో వుంచుకొని తద్వారా మనము తగిన రీతిగా మెలగినప్పుడే ఈ యింద్రియములు మన వశమవుతాయి. యింద్రియములకు దాసుడు కాకూడదు. ఇంద్రియములకు నీవు మాస్టర్ కావాలి. ఆనాడు యింద్రియములకు నీవు దాసుడై నేను మాస్టరు అంటే ఏమి మాస్టరై పోతాడు. కనుక పేరుకు మాస్టరు గాని పెన్నిధికి మాస్టరు కాదు. నిజముగా మాస్టరు కావాలనుకున్నప్పుడు నీ యింద్రియములను అదుపులో వుంచుకో. అది అదుపులో వుంచుకోటానికి ఒకటే మార్గము. దైవ మార్గము ననుసరించాలి. దైవ విశ్వాసము పెంచుకోవాలి. దైవచింతన చేత మన యింద్రియములను సార్థకము గావించుకోవాలి. ఇదే నిజమైన రాజమార్గము. కనుక విద్యార్థులు ఈ మానసిక సంబంధమైన చాంచల్యమునకు యేమాత్రము అవకాశము యివ్వకుండా, కోరికలను అదుపులో వుంచుకొని సాధ్యమైనంత వరకు నీ ఉద్రేకములను శాంతమైన భావములో అదుపులో వుంచుకోండి. సత్యమార్గమును పోషించుకోండి. సత్యము చేత సర్వము సాధించవచ్చు.